www.prajasakti.com


ప్రజాశక్తి

బుధవారం 15 మార్చి 2023 5 ఏలూరు



పోలవరం ప్రాజెక్టు డివిజన్-1 ఇఇగా వెంకటరమణ

ప్రజాశక్తి - పోలవరం



పోలవరం ప్రాజెక్టు డివిజన్-1 ఇఇగా పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ జంగారెడ్డిగూడెం డివిజన్-8 ఇఇ పి.వెంకటరమణ మంగళవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ డివిజన్-1 ఇఇగా పని చేసిన పి.ఆదిరెడ్డి గుండెపోటుతో సోమవారం హఠాన్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అదనపు బాధ్యతలు స్వీకరించినట్లు ఇఇ వెంకటరమణ తెలిపారు.

జగనన్న.. పద్దు పలికేనా..!

ఈ నెల 16న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న 2023-24 బడ్జెట్‌పై జిల్లావాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక జిల్లాలోని అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రతి బడ్జెట్‌లోనూ సరిపడా నిధులు కేటాయించకపోవడం, కేటాయించిన నిధులు ఖర్చు చేయకపోవడం వంటి పరిస్థితి కొనసాగింది. దీంతో సాగునీటి ప్రాజెక్టులు చింతలపూడి, తాడిపూడితోపాటు డెల్టా ఆధునికీకరణ పనులు, ఆక్వా యూనివర్సిటీ, ఫిహార్బర్, పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన హామీలు ఇలా ఏ ఒక్కటీ ఇప్పటికీ నెరవేరలేదు. వైసిపి ప్రభుత్వం తన పాలనా కాలంలో ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే. ఈసారైనా జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయిస్తారా అనే చర్చ జిల్లావాసుల్లో సాగుతోంది.



ముందుకు సాగని చింతలపూడి, తాడిపూడి ప్రాజెక్టు పనులు
పడకేసిన డెల్టా ఆధునికీకరణ
ఆక్వా యూనివర్సిటీ, ఫిషింగ్ హార్బర్ పనులూ అంతే
కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం ప్రకటనలకే పరిమితం
పోలవరం నిర్వాసితుల హామీలకు నిధులిచ్చేనా?
దగ్గులూరు మెడికల్ కాలేజీ కాగితాల్లోనే
16న అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని అత్యంత ముఖ్యమైనవిగా చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల ప్రాజెక్టులు ఉన్నాయి. చింతలపూడి ప్రాజెక్టు పూర్తయితే 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. తాడిపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించి పిల్ల కాలువల తవ్వకాలు జరిగితే 2.60 లక్షల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందనుంది. అయితే ఈ ప్రాజెక్టులు దశాబ్దాలు గడిచినా పూర్తికాని పరిస్థితి నెలకొంది. దీంతో అంచనా విలువ పెరిగిపోతుండటంతో ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేనా అనే అనుమానం జిల్లావాసుల్లో నెలకొంది. 2008లో చింతలపూడి పాజెక్టును రూ.1,701 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాకు విస్తరించింది. మొత్తం 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించింది. రూ.4,909.80 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనాలు రూపొందించారు. ఇప్పటికీ భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదు. 2022-23కు సంబంధించిన బిల్లులు ఇంకా రూ.149 కోట్లు వరకూ పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది. గడచిన బడ్జెట్లో రూ.221 కోట్లు కేటాయించినట్లు చూపినా ఖర్చు చేయలేదని లెక్కలు చెబుతున్నాయి. ఇప్పుడు ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.9,800 కోట్లుకు చేరింది. ఈ ప్రాజెక్టు పనులు 62 శాతం పూర్తయినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటి వరకూ దాదాపు రూ.నాలుగు వేల కోట్లు వరకూ ఖర్చు చేశారు. ఈ ఏడాది మెయిన్ కెనాల్ పనులు 106 కిలోమీటర్ల మేర పూర్తి కావాలంటే రూ.1500 కోట్లు బడ్జెట్లో కేటాయించాల్సి ఉంది. ఈ బడ్జెట్లోనైనా చింతలపూడికి నిధులు కేటాయిస్తారా అనే చర్చ రైతుల్లో సాగుతోంది. తాడిపూడి ఎత్తిపోతల పథకానికి 2004లో అంకురార్పణ జరిగింది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో సాగునీరు అందని దుస్థితి నెలకొంది. ఈ ప్రాజెక్టు నుంచి పూర్తిస్థాయిలో నీరందిస్తే 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.88.53 కోట్లు. ఇప్పటి వరకూ దాదాపు రూ.600 కోట్లు వరకూ ఖర్చు చేశారు. పిల్ల కాలువ తవ్వకం పూర్తయితే సాగునీరు పూర్తిస్థాయిలో అందుతుంది. గత బడ్జెట్లో రూ.పది కోట్లు కేటాయించినట్లు చూపారు. ఈ బడ్జెట్లో పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తే పనులు పూర్తయ్యే అవకాశం ఉంటుంది. కొవ్వాడ, ఎర్రకాలువ రిజర్వాయర్, తమ్మిలేరు రిజర్వాయర్ పనులకు సంబంధించి సైతం నిధుల కేటాయింపు లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా పరిస్థితి తయారైంది. గత బడ్జెట్లో ఈ పనులన్నింటికీ గంపగుత్తగా రూ.68 కోట్లు కేటాయించినట్లు మాత్రం ప్రకటించి మమ అన్పించారు.

పడకేసిన డెల్టా ఆధునికీకరణ పనులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో, రబీలో కలిపి పది లక్షల ఎకరాల్లో వరి సాగు ఉంది. ఎక్కడికక్కడే కాలువలు మెరకదేరిపోవడంతోపాటు లాకుల కట్టడాలన్నీ బ్రిటీష్ కాలంలో నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరాయి. చిన్నపాటి వర్షాలకు సైతం రైతులు పెద్దఎత్తున పంట నష్టపోతున్నారు. 2007లో జిల్లాలో డెల్టా ఆధునికీకరణ నిమిత్తం రూ.1416 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ దాదాపు రూ.800 కోట్లు పనులు పూర్తయ్యాయి. ఇంకా రూ.600 కోట్ల పనుల వరకూ జరగాల్సి ఉంది. గడిచిన మూడేళ్లుగా ఆధునికీకరణ పనులకు సంబంధించి అధికారులు ప్రణాళికలు పంపించడమే తప్ప ప్రభుత్వం నుంచి ఆమోదం మాత్రం రావడం లేదు. ఈ ఏడాది సైతం ఇప్పటి వరకూ ఆధునికీకరణ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ సైతం జరగలేదు. గత బడ్జెట్‌లో కేవలం రూ.పది కోట్లు కేటాయించినట్లు చూపారు. ఈ ఏడాదైనా బడ్జెట్‌లో ఆధునికీకరణకు నిధులు కేటాయిస్తారో.. లేదో చూడాలి.

ముందుకు సాగని ఫిషింగ్ హార్బర్, ఆక్వా యూనివర్సిటీ, కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణ పనులు

నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్, వేములదీవిలో ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. వీటి నిర్మాణాలకు రూ.300 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపింది. ఇప్పటి వరకూ పనులు పెద్దగా ముందుకు సాగని పరిస్థితి. అభివృద్ధి పనులు ముందుకు సాగకపోవడంతో జిల్లా ప్రజానీకంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. సముద్రపు నీరు కొల్లేరులోకి ప్రవేశించకుండా ఉప్పుటేరుపై దుంపగడప, పడతడక, మొల్లపర్రు వద్ద మూడు రెగ్యులేటర్లు నిర్మించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అందుకు రూ.412 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. అయితే పనులు ప్రారంభం కాలేదు. ఈ బడ్జెట్‌లోనైనా రెగ్యులేటర్ల నిర్మాణం ప్రస్తావన ఉంటుందో.. లేదోననే అనుమానాలు నెలకొన్నాయి.

కాగితాల్లోనే దగ్గులూరులో మెడికల్ కాలేజీ

పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయనున్నట్లు 2019లో ప్రభుత్వం ప్రకటించింది. ఆ తర్వాత జిల్లాల విభజన కూడా పూర్తయ్యింది. ఏలూరు మెడికల్ కాలేజీ పనులు కొంతమేర సాగుతుండగా, విభజిత జిల్లా పశ్చిమగోదావరిలోని పాలకొల్లు సమీపంలోని దగ్గులూరులో ప్రకటించిన మెడికల్ కాలేజీ నిర్మాణం కాగితాలకే పరిమితమైంది. దగ్గులూరు మెడికల్ కాలేజీ కోసం సేకరించిన 60 ఎకరాల భూమికి ఇప్పటికీ పూర్తిస్థాయిలో సొమ్ము ఇవ్వని దుస్థితి నెలకొంది. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారో.. లేదో వేచిచూడాలి.

నిర్వాసితులకిచ్చిన హామీల అమలుకు నిధులొచ్చేనా?

పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ కింద రూ.పది లక్షలు, 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షలు పరిహారం ఇస్తామని గత ఎన్నికల్లో వైసిపి ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఏఒక్క హామీ నెరవేర్చలేదు. నిర్వాసితులకిచ్చిన హామీలు గుర్తున్నాయంటూ చెప్పడం మినహా కార్యాచరణకు నోచని పరిస్థితి ఉంది. 2022 జులై, ఆగస్టుల్లో విరుచుకుపడిన గోదావరి వరదలకు పోలవరం నిర్వాసితులు గ్రామాలను వదిలి నెలలు తరబడి పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. 41.15 కాంటూరు వరకూ ఉన్న గ్రామాలకు ప్యాకేజీ పూర్తిస్థాయిలో చెల్లించి ఖాళీ చేయిస్తామని ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికీ పూర్తికాని పరిస్థితి ఉంది. దీంతో పోలవరం ముంపుబారిన పడుతున్న 22,404 కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు అనేది లేకుండాపోయిన సంగతి తెలిసిందే.

నిముషం ఆలస్యమైనా అనుమతించరు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు - అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభం కాబోతున్నాయి. ఒక్క నిముషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదనే కఠిన నిబంధనల నేపథ్యంలో అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 106 కేంద్రాల్లో జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 15 కేంద్రాలు, ఏలూరు జిల్లా పరిధిలో 39 కేంద్రాలు, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 52 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.



భీమడోలులో పరీక్షా కేంద్రం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 72,048 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం 33,874 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 38,174 మంది ఉన్నారు. పరీక్షలు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జరుగుతాయి. ఆయా తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రారంభ సమయానికంటే ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు. అభ్యర్థులు కనీసం అరగంట ముందు పరీక్షా కేంద్రంలోకి చేరుకోవాల్సి ఉంటుంది.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఇంటర్ వార్షిక పరీక్షల్లో విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలు తెలియజేయడానికి ఏలూరులోని ఆర్ఐఒ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. విద్యార్థులు లేదా తల్లిదండ్రులు 08812-230197 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయవచ్చు లేదా కంట్రోలు రూమ్ ఇన్‌ఛార్జి జి.రత్నకిషోర్ 7032241842 నెంబరుకు ఫోన్ చేసైనా సమస్యలను తెలపవచ్చు.

ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లు

పరీక్షలు పటిష్టంగా నిర్వహించడానికి ఆరు ఫ్లయింగ్, 12 సిట్టింగ్ స్క్వాడ్లను నియమించారు. వీటితోపాటు హైపవర్ కమిటీ (హెచ్‌పిసి), జిల్లా పరీక్షల కమిటీ (డిపిసి) సభ్యులు, డివిఇఒలు, రెవెన్యూ అధికారులు ఆయా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారు. మొత్తం 106 మంది ముఖ్య పర్యవేక్షకులు, 106 మంది విభాగాధికారులను నియమించారు. ప్రశ్నాపత్రాలు ఇప్పటికే జిల్లాకు చేరాయి. వీటిని పోలీసు బందోబస్తు మధ్య భద్రపర్చారు. మొత్తం 30 స్టోరేజీ పాయింట్లకు వీటిని తరలించారు. వాటిని పరీక్షా కేంద్రాలకు తరలించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్

అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లోఉంటుంది. ఆయా కేంద్రాలకు సమీపంలోని ఫొటోస్టాట్ దుకాణాలు, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలి. అన్ని కేంద్రాల వద్ద తాగునీటి సదుపాయం కల్పించాం. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులతోపాటు పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వహించే అన్ని శాఖల సిబ్బంది కూడా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, స్మార్ట్ వాచ్‌లు, మొబైల్ ఫోన్స్, ఐపాడ్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదు.

-కె.చంద్రశేఖర్‌బాబు, ఆర్ఐఒ

నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్టమైన నివారణా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సమీపించడంతో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి అవసరమైన కార్యాచరణ అమలు చేయాలన్నారు. ఈ ఏడాది వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందనివిపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీరు అందించడంలో అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, దానికి సంబంధించిన కార్యాచరణ రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. నగరపాలక, పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి చెరువులను ముందస్తుగా ఈ నెలాఖరుకల్లా పూర్తిస్థాయిలో నింపాలన్నారు. జిల్లాలో గుర్తించిన ఆవాసాల్లో బోర్‌వెల్స్, చేతిపంపులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. మంచినీటి ట్యాంకుల పరిస్థితి, లీకేజీలపై పరిశీలించి ట్యాంకుల మరమ్మతులు, క్లీనింగ్ పనులు చేయించాలన్నారు. గ్రామాల్లో మూగజీవాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు సంబంధిత టబ్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. శునకాలు ఎక్కువగా ఉన్న ప్రదేశాలు గుర్తించి అక్కడ నీటితో టబ్‌లను ఏర్పాటు చేయాలని డిపిఒను ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వపరంగా జిల్లాలో 87 ఆర్ఒ ప్లాంట్లు ఉన్నాయని, వాటిలో 21 ప్లాంట్లు మూతబడ్డాయని, వీటిని పునరుద్ధరించడానికి ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. జిల్లాలో 4,346 చేతిపంపులు ఉండగా వీటిలో 308 పంపులు పని చేయడం లేదని, 156 పంపులు రిపేరులో ఉన్నాయని, వీటి మరమ్మతులకు ప్రతిపాదనలు కూడా పంపాలని ఆదేశించారు. జిల్లాలో 269 మంచినీటి చెరువులు ఉన్నాయని, వీటిలో గోదావరి, కృష్ణా కాలువల ద్వారా 228 ట్యాంకులకు 90 నుంచి 70 శాతం వరకు నీటిని నింపడం జరుగుతుందని, 25 ట్యాంకుల్లో 75 నుంచి 50 శాతం, మరో 10 చెరువుల్లో 50 నుంచి 25 శాతం, ఒక చెరువులో 25 శాతం నీరు నింపడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ వెంకటేశ్వరరావు తెలిపారు. జల వనరులను సమర్థవంతంగా నిర్వహించడానికి ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, జిల్లా పరిషత్, డిపిఒల సమన్వయంతో యాక్షన్‌ప్లాన్ తయారు చేసి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. వాటర్ ట్యాక్స్‌ను విఆర్ఒలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లతో కలిసి నూరు శాతం వసూలు చేయించాలన్నారు. ఈ ప్రతిపాదనలన్నీ మార్చి 31వ తేదీకల్లా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, ఇరిగేషన్ ఎస్ఇ శ్రీనివాసరావు, డిపిఒ మల్లికార్జునరావు, ఏలూరు మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, వ్యవసాయశాఖ జెడి రామకృష్ణ, ఎపిఇపి డిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజు, డ్వామా పీడీ రాంబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు, డిఇలు పాల్గొన్నారు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, మామిడి పంటకు బీమా వర్తింపజేసి పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా నాయకులు కోరారు. మంగళవారం మండలంలోని యనమదల గ్రామంలో నష్టపోయిన మామిడి తోటలను వారు పరిశీలించారు. మామిడి పంటకు జరిగిన నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహా, కె.శ్రీనివాస్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.రాజు మాట్లాడుతూ నూజివీడు ప్రాంతంలో వేలాది ఎకరాల్లో సాగు చేస్తున్న మామిడికి గత మూడు సంవత్సరాల నుండి వాతావరణ పరిస్థితుల వల్ల తేనె మంచు, తెగుళ్ల వల్ల దిగుబడి రాక పెట్టుబడి ఎకరాకు రూ.30 వేలు వరకు పెట్టి నష్టపోతున్నారన్నారు. ఐనా రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి పరిహారమూ, బీమా వర్తింపజేయకపోవడం అన్యాయమని అన్నారు. మామిడి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మామిడి రైతులు పాల్గొన్నారు.



మామిడి తోటను పరిశీలిస్తున్న నాయకులు

ఇళ్ల పట్టాలివ్వాలని సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రభుత్వ భూమిలో నివాసాలు ఏర్పర్చుకున్న గిరిజనులందరికీ ఇంటి స్థలం పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. 'ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న వారికి పట్టాలివ్వాలని, కనీస సౌకర్యాలు కల్పించాలి' అని పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ధర్నానుద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ బుట్టాయగూడెం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 614లో 4.94 ఎకరాల భూమిలో మండలంలో ఇంటి స్థలం లేని గిరిజనులు నివాసాలు ఏర్పాటు చేసుకుని రెండు నెలలుగా నివాసముంటున్నారన్నారు. ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్న గిరిజనులకు హక్కు పట్టాలు ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు తమ సొంత గ్రామాల్లో ఇంటి స్థలాలు లేక ఒకే ఇంటిలో రెండు, మూడు కుటుంబాలకుపైగా నివాసం ఉంటున్నాయని, అనేక ఇబ్బందులతో సతమతమవుతూ ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణం చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని గుడిసెలు వేసుకున్న గిరిజనులందరికీ హక్కు పట్టాలిచ్చి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం తహశీల్దార్ ఎస్ఎస్.శాంతికి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె స్పందించి మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు కారం భాస్కర్, కె.దుర్గారావు, ఎస్.దుర్గమ్మ, ఎం.గంగరాజు, తెల్లం మునియ్య, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గిరిజనులు, నాయకులు

'గోద్రేజ్' కార్మికుల అక్రమ బదిలీలు ఆపాలి

ప్రజాశక్తి - చింతలపూడి

గోద్రెజ్ ఆగ్రోవెట్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ కార్మికుల అక్రమ బదిలీలను నిలిపివేయాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని సీతానగరం గ్రామంలో సోమవారం సాయంత్రం ప్రారంభమైన సమ్మె మంగళవారమూ కొనసాగింది. ఈ సందర్భంగా వంటా-వార్పు చేసి నిరసన తెలిపారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులను ఇబ్బంది పెడుతున్న కంపెనీ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులను బానిసలుగా చూస్తున్నారని, నిరంకుశత్వంగా, సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వ్యవరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీలో సుమారు 400 మంది కార్మికులు 2012 నుండి పనిచేస్తున్నప్పటికీ కార్మిక చట్టాలు అమలు చేయకుండా, వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారన్నారు. ఎవరైనా చట్టాల గురించి మాట్లాడితే ఉద్యోగం నుండి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం కార్మికులతో చర్చలకు యాజమాన్యం ముందుకు వచ్చిందని, కానీ ఈ చర్చలకు సిఐటియు నాయకులకు అనుమతి ఇవ్వకపోవడంతో కార్మికులు చర్చలు విరమించుకున్నారు. చర్చల్లో సిఐటియు నాయకులు ఉండాలని తేల్చిచెప్పడంతో యాజమాన్యం చర్చలను రద్దు చేసుకుంది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌విఎస్.నారాయణ, మోడియం నాగమణి, యర్నం సాయికిరణ్, సిఐటియు మండల అధ్యక్షులు నత్తా వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సత్యనారాయణ, కార్మికులు పెద్దిరాజు, బాలకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

ఏలూరు : సీతానగరం గోద్రెజ్ వెట్ పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం అక్రమంగా బదిలీ చేసిన యూనియన్ ఆఫీస్ బేరర్లు ఐదుగురిని ఇక్కడే కొనసాగించాలని, అన్యాయమైన కార్మిక పద్ధతులను అవలంభిస్తున్న ఫ్యాక్టరీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఫ్యాక్టరీ నిరంకుశత్వ విధానాలను భరించలేని కార్మికవర్గం సిఐటియు అనుబంధంగా యూనియన్ ఏర్పాటు చేసుకుందని తెలిపారు. యూనియన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుండగానే ఫ్యాక్టరీ యాజమాన్యం యూనియన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు, కోశాధికారి, కమిటీ సభ్యుడు మొత్తం ఐదుగురిని మిజోరం బదిలీ చేశారని తెలిపారు. యూనియన్ రిజిస్ట్రేషన్ అడ్డుకునేందుకు ఈ విధానాలకు పాల్పడిందని వారు తెలిపారు. యూనియన్‌ను విచ్ఛిన్నం చేసేందుకు యాజమాన్యం ఈ దుశ్చర్యకు పాల్పడిందని వారు విమర్శించారు. ఫ్యాక్టరీ కార్మికులు పనులు నిలుపుదల చేసి ఆందోళన చేస్తుంటే యాజమాన్యం బీహార్, బెంగాల్ బయటి ప్రాంతాల నుంచి వర్కర్లను తీసుకొచ్చి పనులు చేయించాలని చూస్తుందని వారు తెలిపారు. ఈ ప్రక్రియను పోలీసు యంత్రాంగం వెంటనే నిలుపుదల చేయాలని వారు కోరారు. వలస కార్మిక చట్టం అమలు చేయకుండా వలస కార్మికులను తీసుకొచ్చి పనులు చేయించడం చట్ట విరుద్ధమని వారు తెలిపారు. కార్మికుల ఆందోళనకు కార్మిక సంఘాలు, ఉద్యోగ, ప్రజాసంఘాలు మద్దతు తెలపాలని వారు విజ్ఞప్తి చేశారు.

వికలాంగులకు ఉత్తమ సేవలందించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రత్యేక ఉపాధ్యాయులు వికలాంగులకు ఉత్తమ సేవలందించాలని కామన్ పరీక్ష బోర్డు జిల్లా సెక్రటరీ ఎ.సర్వేశ్వరరావు కోరారు. ఏలూరు పరిధిలోని దొండపాడు ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథులుగా హాజరైన సర్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి దక్కని అదృష్టం, ఆత్మసంతృప్తి ప్రత్యేక ఉపాధ్యాయులకు దక్కుతుందని, ఈ శిక్షణ ద్వారా తెలుసుకున్న అంశాలను వికలాంగుల అభివృద్ధికి తోడ్పడేలా ఉపయోగించాలన్నారు.

మార్క్స్ చూపిన బాటలో మార్పు కోసం కృషి

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

కారల్‌మార్క్స్ చూపిన బాటలో సమాజ మార్పు కోసం అంతా కృషి చేయాలని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పిలుపునిచ్చారు. మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ 140వ వర్ధంతి సందర్భంగా స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, సిఐటియు, యుటిఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం చర్చాగోష్టి నిర్వహించారు. దీనికి పి.ఆదిశేషు స్వాగతం పలికారు.



ఏలూరులో నివాళులర్పిస్తున్న నేతలు

గుడిపాటి నరసింహారావు అధ్యక్షతన సాగిన చర్చాగోష్టిలో కారల్ మార్క్స్ చిత్రపటానికి ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షత వహించిన గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ మార్క్స్ జీవితం, ఆయన సిద్ధాంతం ఉత్తేజభరితం, మార్గదర్శకం అని అన్నారు. ముఖ్యఅతిథి షేక్ సాబ్జీ మాట్లాడుతూ మార్క్సిజం, మార్క్స్ జీవితం గురించి నేడు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో చర్చ సాగుతోందన్నారు. మార్క్స్ చూపిన విధంగా మన దేశంలో మార్పు కోసం కృషి చేయడం ద్వారా దేశాన్ని బాగు చేసుకోవచ్చున్నారు. నేటి పాలకులు అన్ని రూపాల్లో ప్రజలను మోసగిస్తున్నారని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మార్క్స్ జీవితం గురించి చర్చించుకోవడం అంటే అది ఆయన సిద్ధాంతం గురించి, దాని అమలుకు మనం చేయాల్సిన కృషి గురించి చర్చించుకోవడం అని అన్నారు. చర్చలో వై.ఆనందనాయుడు, శ్రీహరి కోటి, మేతర అజయ్‌బాబు, ఆర్.లింగరాజు, బి.సోమయ్య, పి.ఆదిశేషు, మిల్టన్, కె.శ్రీనివాస్, కె.విజయలక్ష్మి, విజిఎంవిఆర్.కృష్ణారావు, సిహెచ్.సుందరయ్య, ఆర్.నరసింహమూర్తి, కె.లెనిన్‌బాబు, జి.కోటేశ్వరరావు, గోపీ, జి.రవీంద్ర పాల్గొన్నారు. హాజరైన అందరికీ కమ్యూనిస్టు ప్రణాళిక, కారల్ మార్క్స్ జీవితంపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీహరి కోటి, పి.ఆదిశేషు పాడిన పాటలు, మార్క్స్ జీవితంపై ప్రదర్శించిన వీడియోలు ఆకట్టుకున్నాయి.

ప్రపంచంలో అనేకమంది తత్వవేత్తలు సమాజాన్ని పరిపరివిధాలుగా విశ్లేషించారే గానీ మారే సమాజాన్ని తెలియచెప్పింది కార్ల్‌మార్క్స్ మాత్రమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. మార్క్స్ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రవి మాట్లాడుతూ మార్క్స్ అనేక గ్రంథాలు చదవడమే కాకుండా ప్రపంచ పరిణామాలను సమగ్రంగా అధ్యయనం చేశారన్నారు. దాని నుండి ఆయన ఈ సమాజం వర్గ పోరాటాల ద్వారా మార్పులు చెందుతూ వచ్చిందన్నారు. పెట్టుబడిదారీ విధానం దోపిడీ చేస్తుందని, ఈ దోపిడీ వల్ల ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు పెరుగుతాయని తెలిపారు. ఆర్థిక అసమానతలు తొలగిపోతేనే ప్రజలను పట్టిపీడిస్తున్న నిరుద్యోగం, పేదరికం, కుల వివక్ష వంటి రుగ్మతలు తొలగిపోతాయన్నారు. పెట్టుబడిదారీ సమాజం అభివృద్ధి అయిన తరువాత జరిగే వర్గ పోరాటాల నుండే సోషలిస్టు, కమ్యూనిస్టు వ్యవస్థలు ఏర్పడుతాయని మార్క్స్ తెలిపారన్నారు. మార్క్స్ అందించిన సిద్ధాంత స్ఫూర్తితో కమ్యూనిస్టు శ్రేణులు ఆ పనిలో కంకణబద్ధులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు, బి.సోమయ్య, కె.శ్రీనివాస్, పివి.రామకృష్ణ, ఎ.శ్యామలారాణి, నగర నాయకులు జి.గోపి, మంచెల్ల ఇస్సాకు, ఎస్.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, గౌడ రవీంద్ర, గనిగంటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: దోపిడీదారులను ఎదిరించినప్పుడే కార్మిక వర్గానికి నిజమైన విముక్తి కలుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి మానుకొండ జీవరత్నం అన్నారు. మార్క్స్ వర్ధంతి సభ స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, నాయకులు నాయుడు వెంకన్న, బొబ్బిలి గంగరాజు, బి.నాని, టి.యశ్వంత్, పి.మణికుమార్, డి.ఆశీర్వాదం, బాలరాజు, కె.రాజు, ఎ.స్టాలిన్ పాల్గొన్నారు.

నిడమర్రు : మార్క్స్ వర్ధంతి సభ భువనపల్లిలో సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ ప్రపంచగతినే మార్చిన మార్క్స్ త్యాగధన్యుడని, నేటి ప్రపంచ పరిణామాలను ఆయన ముందుగానే అధ్యయనం చేశారని, కార్మికవర్గానికి దిశా నిర్దేశం చూపిన మహావ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ, కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన్, లింగబరి లక్ష్మణరావు, ప్రగడ మణికంఠ, వలపు సత్తిబాబు, గిరిబాబు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ముదినేపల్లి

15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మొండితోక జాన్సన్ మంగళవారం తెలిపారు. ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 236 మంది జూనియర్ ఇంటర్, 229 మంది సీనియర్ ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. కళాశాలకు చెందిన ఎంపిసి, బైపిసి, హెచ్ఈసి గ్రూపుల విద్యార్థులు 121 మంది పరీక్షలకు హాజరవుతున్నారని, 115 మంది వివిధ, వికాస్, ప్రయివేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. పరీక్షలకు సంబంధించి కళాశాలలో 12 గదులు ఏర్పాటు చేశామన్నారు. 13 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షలకు డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ రాంబాబు నియమితులైనట్లు చెప్పారు. 15వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం, 16 నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రారంభం కానున్నాయన్నారు.

ఉంగుటూరు: ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బివి.శ్రీనివాస్ వెల్లడించారు. ఈ కాలేజీతో పాటు గీతాంజలి జూనియర్ కాలేజీ విద్యార్థులు కూడా ఇక్కడే పరీక్షలు రాయనున్నారన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 136, సీనియర్ ఇంటర్ విద్యార్థులు 177 మంది జంబ్లింగ్ విధానంలో పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఎనిమిది తరగతి గదుల్లో సీసీ కెమెరాలు అమర్చామని చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా పి.వెంకటేశ్వరరావు, డిపార్టుమెంట్ అధికారిగా దేవరాజు వ్యవహరించనున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణపై మంగళవారం ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు.

భీమడోలు: స్థానిక శ్రీవెంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలో ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కళాశాల ప్రధాన ఆచార్యులు వంగా నాగేశ్వరరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులు 165 మంది, సీనియర్ ఇంటర్ విద్యార్థులు 175 మంది హాజరుకానున్నారు. విద్యార్థులు కోవిడ్ నిబంధనలు పాటించాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించారన్నారు.

గణపవరం : ఇంటర్ పరీక్షలకు స్థానిక జూనియర్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు చేశామని ప్రిన్సిపల్ రఘు తెలిపారు. నిర్ణీత సమయానికి విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి రావాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అన్ని వసతులూ కల్పించామని తెలిపారు.

అనారోగ్యంతో బొబ్బిలి కొండలరావు మృతి

నూజివీడు: నూజివీడు పట్టణ ప్రముఖులు, కీర్తిశేషులు ఎంఆర్.అప్పారావు ముఖ్యఅనుచరుడు, నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షులు బొబ్బిలి కొండలరావు(88) అనారోగ్యంతో మంగళవారం విజయవాడలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు కుమార్తె ఉన్నారు. 40 ఏళ్లుగా క్లబ్ అధ్యక్షులుగా కొండలరావు కొనసాగుతున్నారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. స్థానిక డిఎఆర్ కాలేజీ కమిటీ కార్యదర్శిగా 40 ఏళ్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రోటరీ క్లబ్‌కు స్థలాన్ని ఆయన విరాళంగా అందజేశారు. ట్రిబుల్ ఐటీ నూజివీడు రావడానికి ఆయన విశేష కృషి చేశారు. క్రీడల పట్ల ఎంతో ఆసక్తి కలిగిన కొండలరావు, టెన్నిస్, ఫుట్‌బాల్, వాలీబాల్, చెడుగుడు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ క్రీడాకారుల సంక్షేమ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా పని చేశారు. అలాగే నూజివీడు దసరా ఉత్సవాల నిర్వహణలో ప్రముఖపాత్ర పోషించేవారు.



కొండలరావు (ఫైల్)

ప్రముఖుల సంతాపం : కొండలరావు మృతికి ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సంతాపం తెలిపారు. మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీ, మరో కో ఆప్షన్ సభ్యులు లాంప్రసాద్‌రావు, స్పోకెన్ క్లబ్ సభ్యులు మృతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

మద్ది ఒక్కరోజు ఆదాయం రూ.లక్ష

జంగారెడ్డిగూడెం: గురువాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించిన యాత్రికులు వెయ్యి మందికి అన్నదానం చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.కొండలరావు తెలిపారు. మంగళవారం ఆలయానికి అధిక సంఖ్యలో యాత్రికులు తరలి వచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయానికి ఒక్కరోజు రూ.1,07,474 ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, చైర్మన్ సరిత విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల పట్ల మహిళా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక రూరల్ స్టేషన్లో సచివాలయాల మహిళా పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా అంకిత భావంతో పనిచేయాలని ఆయన కోరారు.

ఆగిరిపల్లి: మహిళా పోలీసులు గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి, అంకితభావంతో పనిచేయాలని ఎస్ఐ ఎన్.చంటిబాబు అన్నారు. ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో మహిళా పోలీసులకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ నాయక్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

యర్రమిల్లిపాడులో డ్రైడే

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు పిహెచ్‌సి ఆధ్వర్యంలో యర్రమిల్లిపాడులో డ్రైడే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పిహెచ్‌సి ఎంఒ కె.సుబ్బరాజువర్మ, తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు వివరించారు. అనంతరం దూబచర్లకు చెందిన ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్‌సిపేటలో 72 మందికి దోమ తెరలను ఆ సంస్థ డైరెక్టర్ ఇవాం జలిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తమ్మిన శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

30 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - పోలవరం

ఎల్లండీపేటలో మంగళవారం పెంతెకోస్తు హెల్పింగ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శిబిరం నిర్వహించారు. రాజమండ్రి కంటి ఆసుపత్రి వైద్యులు సేవలందించారు. 30 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో పది మందికి కళ్లజోళ్లు అందించారు. ఎనిమిది మందికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నేత్ర వైద్యులు సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన వారికి పెంతెకోస్తు హెల్పింగ్ మినిస్ట్రీ తరపున పి.శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతీరోజు క్రమంతప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ప్రత్యేక అవసరాలుగల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి అన్నారు. మంగళవారం ముసునూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హెచ్.హన్నామణి ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎం వి.లక్ష్మీనారాయణరావు, జె.నాగమల్లేశ్వరి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యాపారులకు నోటీసులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్థానిక సెంటర్‌లో రోడ్లు, డ్రెయినేజీలను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తూ, ట్రాఫిక్‌కు తీవ్ర అటంకం కలిగిస్తున్న దుకాణాలను తొలగించాలని మంగళవారం ముదినేపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో నోటీసులు జారీ చేశారు. ముదినేపల్లిలో మార్కెట్ వద్ద, గురజ రోడ్డు సెంటర్‌లో రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ అక్రమణదారులు డ్రెయినేజీ పూడ్చివేసి మురుగునీరు బయటకు పారుదల లేకుండా చేస్తున్నారు. దీనికితోడు ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడుతోంది. ఈ క్రమంలో దుకాణాలు తొలగించాలంటూ పంచాయతీ కార్యదర్శి టివి.సారథి నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల్లో ఖాళీ చేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు.


కోడిపందేల శిబిరంపై దాడి

ఆగిరిపల్లి: కృష్ణవరంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై ఎస్ఐ ఎన్.చంటిబాబు తన సిబ్బందితో దాడిచేసి ముగ్గురు పందెం రాయుళ్లను మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1,950 నగదు, కోడిపుంజు, ఐదు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

‘పది’ విజయానికి పక్కా ప్రణాళిక..!

ఉదయం 8.30 గంటల నుంచి ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహణ

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ప్రజాశక్తి - చింతలపూడి

పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నామని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.కిరణ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. విద్యార్థుల ఎదుగుదలకు పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణత తొలిమెట్టు అని అన్నారు. అలాంటి ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నామన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామన్నారు. ప్రతివిద్యార్థి 10/10 గ్రేడ్ పాయింట్లు సాధించేలా కృషి చేస్తున్నామన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఒత్తిడి గురికాకుండా, పాఠాలు సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధిస్తున్నారని, విద్యార్థులను పరీక్షలకు అన్నివిధాలా సన్నద్ధం చేస్తున్నామన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



ప్రజాశక్తి - ఏలూరు

ఈ ఏడాది పదోతరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ మార్కులు సాధనకు పక్కా ప్రణాళికతో ముందుకుసాగుతున్నామని శ్రీదీప్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఎల్.గిరిబాబు తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామన్నారు. ముఖ్యంగా తమ ఉపాధ్యాయులు విద్యార్థులను ఒత్తిడికి గురిచేయకుండా పాఠాలు బోధిస్తున్నారన్నారు. ప్రతివిద్యార్థి ఉత్తీర్ణత సాధించడంతో పాటు అత్యధిక గ్రేడ్‌పాయింట్లు సాధించే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఏమైనా సబ్జెక్టుల్లో విద్యార్థులు వెనుకబడితే వారిపై ప్రత్యేక దృష్టిపెట్టి అభివృద్ధి చేస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

జిల్లావ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జాతీయ నులిపురుగుల నివారణలో భాగంగా డిఎంహెచ్ఒ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు రూరల్ శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ డి.ఆశ, డిఇఒ ఎన్‌వి.రవిసాగర్, ఆర్‌బిఎస్‌కె జిల్లా కో-ఆర్డినేటర్ సిహెచ్ మానస పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

ప్రతీ విద్యార్థి నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని యుటిఎఫ్ జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు నంబూరి రాంబాబు సూచించారు. మంగళవారం సుంకరవారితోట ఎంపియుపి స్కూల్ విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ ఎస్.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు నంబూరి రాంబాబు, బి.శ్రీనివాసరావు, రజనీ, ప్రసాద్, సూర్యచంద్రరావు, పావని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గొల్లపల్లి పిహెచ్‌సిలో వైద్యులు పి.శ్రీనివాస్‌గౌతమ్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు పి.అనూష పిహెచ్‌సి పరిధిలో 5752 మందికి గాను 5470 మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ శ్రీనివాసరావు, పద్మావతి, ఎఎన్ఎం వెంకటేశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరు: నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు ఖచ్చితంగా వాడాలని చేబ్రోలు పిహెచ్‌సి వైద్యాధికారి కె.సుబ్బరాజువర్మ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్లలోపు వారికి మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్ల వారికి ఆల్బెండజోల్ మాత్రలు సరఫరా చేసినట్లు రమణక్కపేట పిహెచ్‌సి వైద్యులు కరీముల్లా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని 16 గ్రామాల్లో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు మాత్రలు అందిస్తున్నట్లు తెలిపారు.

గణపవరం : నులిపురుగులు నివారణతో రక్తహీనతను నివారించొచ్చని గణపవరం పిహెచ్‌సి వైద్యులు సంతోష్ నాయుడు సూచించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మల కుమారి, వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, అధ్యాపకులు అక్కిరాజుఉ, స్వరూపరాణి, అనురాధ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రమేష్‌కుమార్, చిన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. డాంగే నగర్ సచివాలయ ఎఎన్ఎం సుదీప, ఆశా వర్కర్ శుభాంబి వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ వి.హనుమంతరావు, సభ్యులు జి.వెంకట్‌లాల్, టి.జాన్సీ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: పిల్లల్లో రక్తహీనతను నివారించాలంటే, ముందుగా నులి పురుగులను నివారించాలని ఆగిరిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి జాస్తి జగన్మోహన్‌రావు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపిడిఒ కె.వాణి ద్వారా నులిపురుగుల నివారణ మాత్రలను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి షేక్ టీనా, సిహెచ్ఒ జె.లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టి.నరసాపురం : నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మండల వైద్యాధికారి ఎం.శ్రీనివాస్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 నుండి 19 సంవత్సరాల పిల్లలకు, కిశోర బాలికలకు ఈ మాత్రలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్‌టి.స్వామి, సిహెచ్ఒ పి.ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా పిహెచ్‌సిల ఆధ్వర్యంలో మండలంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యురాలు కె.దివ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మాత్రలను 1 నుంచి 19 ఏళ్లలోపు వారు తప్పతక వేసుకోవాలన్నారు.

రూ.కోటితో కబేళా అభివృద్ధి పనులు : మేయర్

ఏలూరు టౌన్: ఎంఎల్ఎ ఆళ్ల నాని ఆదేశాలతో సుమారు రూ.కోటి నిధులతో కబేళాలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. స్థానిక మాదేపల్లిరోడ్‌లోని మేకల కబేళాలో జమాతుల్ ఖురేషి (మేక మాంసం వర్తక సంఘం) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి మేయర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కబేళాలోని రక్తపు నీటి దుర్వాసన నివారణకు రూ.25 లక్షలతో అధునాతన టెక్నాలజీతో ట్రీట్మెంట్ ప్లాంట్‌ను నిర్మించి బయటకు వచ్చిన రక్తపు నీటిని శుద్ధిచేసి అనంతరం బయో కెమికల్ ప్రాసెస్ చేసి ఆ నీటిని మొక్కల పెంపకానికి ఉపయోగించడం జరుగుతుందన్నారు. దీని కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయగలిగామన్నారు. అదే విధంగా కబేళాలో వ్యర్థాల నీరు భూమిలోకి వెళ్లకుండా ఫుడ్ ఇండస్ట్రీస్‌లో ఉపయోగించే పియు ఫ్లోరింగ్ చేశామని, అవసరమైనన్ని ఎగ్జాస్ట్ ఫ్యాన్లు అమర్చామని చెప్పారు. కబేళాలోని కమ్యూనిటీ హాలులో జమాతుల్ ఖురేషి ముస్లిములు నమాజులు, ప్రార్థనలు, కార్యవర్గ సమావేశాలు నిర్వహించేందుకు ఆళ్ల నాని ఆదేశాలతో కౌన్సిల్ తీర్మానం చేశారని, బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు ఐక్యతతో కబేళాను మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. నూతన కార్యవర్గానికి మేయర్ దంపతులు శుభాకాంక్షలు తెలిపారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలిన నేతలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

సామాజిక న్యాయం జనసేన పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు అడపా నాగరాజు తెలిపారు. మండలంలోని ఏపిగుంట పంచాయతీ పరిధిలోని శ్రీరామవరంలో కార్యకర్తలు పార్టీ ఆవిర్భావ సభకు బస్సుల్లో బయలుదేరారు. ఈ బస్సును నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు. హైటెక్ బస్‌లు ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ, జనసేన అభిమానులు సత్య వెజ్జు, వంశీ పసుపులేటి, సింగంశెట్టి నాగ సుబ్రహ్మణ్యంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాఘవ రాజు సురేష్, తోట సాయి, పాపోలు సుబ్రహ్మణ్యం, పాలేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

చింతలపూడి: 2024లో జనసేనను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆ పార్టీ చింతలపూడి అధ్యక్షులు చీదరాల మధుబాబు అన్నారు. చలో మచిలీపట్నం కార్యక్రమానికి మండలం నుండి అధిక సంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. చింతలపూడి పాతబస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోలవరం: మచిలీపట్నంలో జరిగిన జనసేన ఆవిర్భావ వేడుకలకు మండల జనసేన అధ్యక్షులు గునపర్తి చిన్ని ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ పోలవరం నుండి బస్సుల్లో, కార్లలో మండలంలో అన్ని గ్రామాల నుండి తరలి వెళ్లామన్నారు.

నూజివీడు : జనసేన ఆవిర్భావ సభకు బర్మా ఫణిబాబు ఆధ్వర్యంలో పెద్దఎత్తున బైక్‌ర్యాలీగా తరలివెళ్లారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుండి భారీ సంఖ్యలో జనసైనికులు మచిలీపట్నం వెళ్లారు.

ముదినేపల్లి : మచిలీపట్నంలో జరిగే జనసేన ఆవిర్భావ సభకు మండలం నుంచి జనసేన నాయకులు పెద్దఎత్తున భారీగా తరలివెళ్లారు. ముదినేపల్లి సెంటర్‌నుంచి వివిధ వాహనాల్లో వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షులు వీరంకి వెంకయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వేల్పూరి నానాజీ, పోకల కృష్ణ, అంబుల భరత్, యర్రంశెట్టి శివప్రసాద్ సభకు వెళ్లారు.

భీమడోలు : జనసేన ఆవిర్భావ వేడుకలు భీమడోలులో పార్టీ నాయకులు పత్తి మదన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఎగరవేశారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. అనంతరం నాయకులు వి.ధర్మరాజు ఆధ్వర్యంలో మచిలీపట్నంలో జరిగే పార్టీ ఆవిర్భావ సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎన్.గణ, డి.సునీల్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - వేలేరుపాడు

కన్నాయిగుట్టలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వంకోల్పోయి నిరాశ్రయులైన బాధితుల బాధలు వర్ణనాతీతమని ఫ్రెండ్స్ ఆటో యూనియన్ అధ్యక్షులు కురిమళ్ల శ్రీను అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఫ్రెండ్స్ ఆటో యూనియన్ తరపున 27 కుటుంబాలకు ఒక్క కుటుంబానికి ఒక తాగునీటి డ్రమ్మును అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మండలంలో ఏదో ఒక మారుమూల గ్రామంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకుంటుందని, ప్రతీ ఏడాది వేసవిలో పేద కుటుంబాల వారు బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు దగ్గరలో ఫైర్ ఇంజన్ లేకపోవడం వల్ల ఎక్కువ కుటుంబాల వారు నష్టపోతున్నాయని, ప్రభుత్వం స్పందించి మండలంలో ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని ప్రమాద బాధితులను దాతలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు సువ్వేటి లతా, హెడ్ కానిస్టేబుల్ దానియేలు, సిపిఐ మండల కార్యదర్శి బాడిస రాము, ఫ్రెండ్స్ ఆటో యూనియన్ సభ్యులు కమ్మిసిచ్చు రమేష్, నాళ్లసిరి సూరి, అఫ్రోజ్, మజ్జి శ్రీను, జాకీర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోవడం బాధాకరమని టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, దుప్పట్లు టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు అమరవరపు అశోక్, అంకన్న గూడెం గ్రామ కమిటీ అధ్యక్షులు సోయం శేఖర్, వీరంకి పాపారావు, కురిమెళ్ల సుధాకర్, శాఖమూరి సంజీవులు, కరుటూర రాధాకృష్ణ పాల్గొన్నారు.